

రేపు రాయచోటిలో 5కె మారథాన్ రన్ : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-రాయచోటి

ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంపై అవగాహన కొరకు ఆదివారం రాయచోటిలో 5కె మారథాన్ రన్ ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాలో ప్రజలందరికీ, ముఖ్యంగా యువతకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించేందుకు "యూత్ ఫెస్ట్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ "యూత్ ఫెస్ట్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 31న ఉదయం 5.30 గంటలకు రాయచోటిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషుల) (చిత్తూర్ రోడ్) నుండి మదనపల్లి రింగ్ రోడ్, అనంతరం తిరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు "5కె మారథాన్ రెడ్ రన్" కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ మారథాన్ రన్ కార్యక్రమంలో రాయచోటిలోని యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పటిష్టం చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ఎంఎస్ఎంఇ 1989 యాక్ట్ నిబంధనల మేరకు జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పటిష్టం చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ విసి హాలులో జిల్లా పరిశ్రమల భద్రతా కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ కల్పించేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రత చర్యలను పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. రెడ్ కేటగిరీలో ఉన్న పరిశ్రమల్లో తగిన రక్షణ, భద్రత కల్పించేందుకు, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోటోకాల్ చర్యలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 35 హై రిస్క్ పరిశ్రమలలో నిర్దేశించిన 6 పారామీటర్ల మేరకు భద్రతా ప్రమాణాలను పరిశీలించి, 50 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని అధికారుల బృందాన్ని ఆదేశించారు. భద్రతా ప్రమాణాలు సరిగాలేని పరిశ్రమల అంశంలో తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై కూడా నివేదిక సమర్పించాలన్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండల పరిధిలోని ఓ పరిశ్రమలో తాజాగా జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని పరిశ్రమల్లో భద్రతా చర్యలు మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లాలో రిజిస్టర్డ్ ఫ్యాక్టరీలు, అందులో పనిచేస్తున్న కార్మికులు అందరికీ విధి నిర్వహణలో భద్రత కల్పించే దృష్ట్యా అన్ని ఫ్యాక్టరీలలో భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. హానికర పదార్థాల ఉత్పత్తులు, వినియోగం జరిగే పరిశ్రమలను వాటి తీవ్రతను బట్టి కేటగిరీలుగా విభజించి వాటిలో తరచూ భద్రతా చర్యలు తనిఖీలు నిర్వహించేలా జిల్లాలో ప్రధానంగా ఏమర్జెన్సీ బేస్డ్ రెస్క్యూ సర్వీసెస్ అవసరమైన 35 ఫ్యాక్టరీలను గుర్తించామన్నారు. ఎంఎస్ఎంఇ యాక్ట్ ప్రకారం ఫ్యాక్టరీల్లో చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని, క్రైసిస్ గ్రూప్ సభ్యులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒక చిన్న మానవ తప్పిదం వల్ల కార్మికుల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం రాకూడదని హెచ్చరించారు. ప్రతి 45 రోజులకు ఒకసారి భద్రతా చర్యల అమలుపై తనిఖీలు నిర్వహించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

మెటీరియల్ సేఫ్టీ డేటా షీట్ నిర్వహణపై ఆపద మిత్రలు పరిశ్రమల పరిసరాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రెవెన్యూ, ఫైర్ శాఖల అధికారులు సమన్వయంతో తరచుగా మాక్ డ్రిల్ కార్యక్రమాలు నిర్వహిస్తూ కార్మికుల్లో, ప్రజల్లో ఫ్యాక్టరీలలో ప్రమాదాల నివారణ, ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన అత్యవసర చర్యలపై అవగాహన పెంపొందించాలన్నారు. ముందుగా రెడ్ కేటగిరీ పరిశ్రమల్లో తనిఖీలను చేయాలని, ప్రమాదాల నివారణకు ప్రోటోకాల్ ప్రకారం ఏయే భద్రతా చర్యలు తీసుకోవాలో చెక్ లిస్ట్ తయారు చేసి, అన్ని పరిశ్రమల యాజమాన్యాలకు పంపాలని జిల్లా ఫ్యాక్టరీస్ పర్యవేక్షకులను ఆదేశించారు. కార్యక్రమంలో ముందుగా డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష?మూర్తి మాట్లాడుతూ జిల్లాలో అమోనియా వాడే పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని, అలాగే కెమికల్ ఫ్యాక్టరీలు, ఒక హెచ్‌పిసిఎల్ స్టోరేజ్, మరొక పెద్ద స్టోరేజ్ ఇండస్ట్రీ ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు తీవ్రమైన ప్రమాదాలు ఏవి జరగలేదని పేర్కొన్నారు. అనుకోని చిన్న చిన్న ప్రమాదాలు 20 దాకా ఉన్నాయని, మరికొంత తీవ్రత ఉన్నవి 4 సంఘటనలు ఉన్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమల్లో అనుకోని అగ్ని ప్రమాదాలు, ఇతరత్రా సంఘటనలు ఏర్పడినప్పుడు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి అన్న విషయంలో అవగాహన కల్పించేందుకు నేడు సమావేశం నిర్వహించడం జరిగిందని కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సూరిబాబు, జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్ కుమార్, డిటిసి భరత్, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పోలీసు, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏకీకృత పెన్షన్ విధానం అమలు తగదు : యుటిఎఫ్

ప్రజాశక్తి-రాయచోటి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉపాధ్యాయుల పనిసర్దుబాటు ప్రక్రియను పాఠశాల విద్యా శాఖ అధికారులపై స్థాయి నుంచి కింది స్థాయి వరకు గందరగోళానికి గురిచేశారని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబిర్ పేర్కొన్నారు. అసంబద్ధ ఉపాధ్యాయుల పనిసర్దుబాటు, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఏకీకృత పింఛను విధానాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను సవరించాలన్నారు. ఉన్నత పాఠశాలలో సబ్జెట్ టీచర్స్ నింపాలనే కారణంతో ఎస్‌జిటిలను ఇష్టారాజ్యంగా, బలవంతంగా పని సర్దుబాటు చేశారన్నారు. గత ప్రభుత్వం జిఒ 117 ద్వారా ప్రాథమిక పాఠశాలలని విచ్ఛిన్నం చేస్తే ఇప్పుడు పనిసర్దుబాటు పేరుతో ప్రాథమిక పాఠశాలలను బలహీన పరుస్తున్నారని పేర్కొన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న పాత పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల హక్కు అని బిక్ష కాదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సైతం ఖాతరు చేయకుండా సిపిఎస్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిఎస్ విధానాన్ని రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయుల తిరస్కరించారు. పాత పెన్షన్ ఎక్కడా పోలికలేని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు లాభంలేని కార్పొరేట్ల షేర్ మార్కెట్‌ను మాత్రమే లాభాన్ని లేకూర్చే యుపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ని పునరుద్ధరించాలని డిమాండ్స్ వస్తున్న తరుణంలో ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేస్తూ యుపిఎస్ లాంటి అంకెలగారడీ చేసే పెన్షన్ స్కీమ్ వద్దని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి బి.చంద్రశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి దావుద్దీన్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ప్రసాద్, చిన్నమండెం మండల సహాధ్యక్షుడు కిఫాయత్, సీనియర్ నాయకులురెడ్డి, ముని, సుధాకర్, కె.విపల్లె మండల అధ్యక్షుడు రమణ, నాయకులు రాజబాబు, మోహన్ నాయక్, నాయకులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2004లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానానికి స్వస్తి చెప్పి సిపిఎస్ విధానాన్ని తీసుకొచ్చి ఉద్యోగ ఉపాధ్యాయలకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, అసోసియేట్ అధ్యక్షులు హేమలత, కార్యదర్శిలు పురం వెంకటరమణ, ఆదినారాయణ, సీనియర్ నాయకులు రవిప్రకాష్, గాలి రవీంద్ర, సుధాకర్, శ్రీనివాసులు పయని హరికృష్ణ శ్రీలత, నాగరత్న పాల్గొన్నారు.



రాయచోటి : నిరసన వ్యక్తం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

చలో తిరుపతిని జయప్రదం చేయండి : సిఐటియు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యుత్తు కార్మికులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యుత్ కార్మికుల సమస్యలపై సెప్టెంబర్ 5వ తేదీన తిరుపతిలోని ఎపిఎస్‌పిడిసిఎల్ వద్ద జరుగు ఆందోళనను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ కోరారు. శుక్రవారం తిరుపతి రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు చలో తిరుపతి కరత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుడు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 23,500 మంది విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, 2022 పిఆర్‌సి ఎరియర్స్ ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అన్ స్కిల్డ్ కార్మికులకు స్టిల్ చేసి స్కిల్డ్ వేతనం ఇవ్వాలని తెలిపారు. కొత్త ఆపరేటర్లకు, పాత ఆపరేటర్లకు సమానంగా వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఐటిఐ విద్యార్హత ఉన్న అన్ స్కిల్డ్ కార్మికులకు స్కిల్డ్ చేసి స్కిల్ వేతనం ఇవ్వాలని చెప్పారు. కొత్త ఆపరేటర్లుగా ఉన్న వారందరికీ పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మీటర్ బిల్ ఏజెన్సీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎస్‌పిఎం కార్మికులకు కనీస వేతనం, ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్మికుడికి గాని, కార్మిక కుటుంబాల్లో గాని ఏదైనా అనారోగ్య సమస్య, ప్రమాదాలు సంభవించినప్పుడు పూర్తిగా ఉచితంగా ప్రభుత్వమే వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. చలో తిరుపతి కార్యక్రమానికి జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరూ పాల్గొని ధర్నా జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుఇఇయు జిల్లా కార్యదర్శి శ్రీహరి, యుఇఇ డబ్ల్యూయు డివిజన్ అధ్యక్షులు డి.సుధాకర్, ఉపాధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యం, నాయకులు శివ, లక్ష్మీరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, రుక్మిణమ్మ, ప్రసన్న లక్ష్మీ, సుబ్బారాయుడు, సుబ్రహ్మణ్యం, భాను ప్రకాష్, కత్తి రమేష్ బాబు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కృష్ణా జిల్లా గుండ్లవలేరు ఇంజినీర్ కళాశాలలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ఎదురుగా నిరసన చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్నానపు గదుల్లో రహస్య కెమెరాలు పెట్టి మూడు వందలకుపైగా ఉన్న వీడియోలు బయటకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజి అమానవీయ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు చదవు, సంస్కారం నేర్పాల్సిన విద్యా సంస్థలు పిల్లలకు ఏం నేర్పుతున్నాయోనన్న ఆలోచనలో పడేసిందన్నారు. ఉన్నత చదువుల కోసం ఆడపిల్లలను కాలేజీలకు పంపితే వారి మానప్రాణాలకు రక్షణ లేకుండా పోవడానికి ఈ ఘటనే మరో నిదర్శనమని తెలిపారు. కాలేజిల్లో పర్యవేక్షణ కొరవడిందనడానికి సజీవ సాక్ష్యమని యాజమాన్యాల నిర్లక్ష్యానికి నిలవెత్తు దర్పణమన్నారు. కాసుల కక్కుర్తి తప్పా భద్రత ప్రమాణాలు గాలికొదిలేశారని ఫాస్ట్రాక్ విచారణ జరిపించాలన్నారు. తక్షణం ఉన్నత స్థాయి కమిటి వేసి సీనియర్ ఐపిఎస్ అధికారులతో విచారణ జరిపించాలని కోరారు. స్నానపు గదిలో కెమెరాలు పెట్టింది ఎవరో వెంటనే తేల్చాలని కోరారు. ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని, మరోసారి ఇలాంటి అఘాయిత్యానికి ఒడిగట్టాలంటే భయపడేలా చర్యలు చేపట్టాలని కోరారు. స్నానపు గదులలో రికార్డ్ అయిన ఏ వీడియో కూడా ప్రజల్లోకి రాకుండా చూడాలని పోలీస్ శాఖ, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలపై మరోసారి జరగకుండా చూడాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల పక్షాన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, జిల్లా కమిటీ సభ్యులు జస్వంత్, నరేష్, చెంగయ్య, గురునాథ్, జూనియర్ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం'

ప్రజాశక్తి-రాయచోటి

మనమందరం మొక్కల నాటి పర్యావరణాన్ని కాపాడుకున్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం వనమహోత్సవం సందర్భంగా పట్టణ సమీపంలోని మాండవ్య ఎకో పార్క్ (నగరవనం)లో సామాజిక వన అటవీ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజే 68 వేల మొక్కలు నాటామని తెలిపారు. ఎక్కడైతే చెట్లు నాటామో వాటిని అలా వదిలి వేయకుండా వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అత్యంత అటవీ ప్రాంతం ఉన్న జిల్లాలలో అన్నమయ్య జిల్లా కూడా ఒకటిన్నారు. 36 శాతం భూభాగం అటవీ ప్రాంతంగా ఉందన్నారు. మనమందరం ఒక బాధ్యతగా అడవిలోని చెట్లను కాపాడుకోవాలని చెప్పారు. జిల్లాలో మొక్కలను విరివిగా నాటాలని, బఫర్ జోన్లల, రోడ్ల పక్కన, పార్కులు, పాఠశాలలు, కాలేజీలు, ఇంటి పరిసరాలలో ఎక్కడ వీలైతే అక్కడ చెట్లను పెంచుకోవాలని పేర్కొన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో రాయలసీమలో వర్షాలు చాలా తక్కువ పడ్డాయిని వర్షాలు పడాలన్నా పంటలు పండాలన్నా కూడా మనందరికీ చెట్లు ఎంతగానో అవసరమని ఎక్కడైతే చెట్ల, సంపద వృక్ష సంపద, అటవీ శాతం ఎక్కువగా ఉంటుందో అక్కడ వర్షాలు బాగా పడతాయన్నారు. అడవి ఎక్కడ ఉంటుందో అక్కడ నేల కూడా కోతకు గురికాదన్నారు. మనకున్న అత్యంత సహజ వనరుల్లో నేల కూడా ఒకటి నేలలు ఏర్పడాలంటే 15 సంవత్సరాలు పడుతుందని అంచనాతో సారవంతమైన నేల, మట్టి కొట్టుకుపోతే పంటలు పండవని అనేక ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ఒక్కటే కాదు సంరక్షించడం, ప్రతి ఒక్కరూ ఒక్కొక్కరి పేరుతో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారం దరితో మొక్కలను నాటి సంరక్షిస్తామని చెట్ల సంపద, వృక్ష సంపదను కాపాడు కుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా అటవీ శాఖ అధికారి పి.వివేక్, సబ్ డివిజనల్ అటవీ శాఖ అధికారీ శుభమ్, డివిజనల్ అటవీశాఖ అధికారీ నాగమనేశ్వరి, సబ్ డివిజనల్ అటవీ అధికారి శ్రీనివాసులు, డ్వామా పీడీ మద్దిలేటి, మున్సిపల్ కమిషనర్ వాసు బాబు, బిజెపి జిల్లా ప్రెసిడెంట్ సాయి లోకేష్ కుమార్, ప్రయివేట్ ఎడ్యుకేషనల్ స్టేట్ జెఎసి కన్వీనర్ పి.మదన్ మోహన్‌రెడ్డి, వివిధ శాఖ అధికారులు, అటవీ శాఖ సిబ్బంది, అర్చనా విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్క నాటి మట్టిపోస్తున్న కలెక్టర్ శ్రీధర్

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3వ తేదీన రాయచోటి పాలిటెక్నిక్ కళాశాల, మదనపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం జాబ్‌మేళా కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో బహుళ జాతీయ కంపెనీలు పాల్గొనుచున్నాయని తెలిపారు. వాటి ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. జాబ్ మేళాలో బ్యాంక్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, రిలయన్స్, కెఎల్ గ్రూప్స్, లాంటి బహుళ జాతీయ కంపెనీలు పాల్గొననున్నాయని పేర్కొన్నారు. జాబ్‌మేళాలో హాజరయ్యే నిరుద్యోగ యువతీ, యువకులు విద్యార్హతలు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్, ఎనీ డిగ్రీ, ఎనీ బి.టెక్, పిజి, చదివిన వారు 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. జాబ్ మేళాలో సెలెక్ట్ అయిన అభ్యర్థులకి నెలకి రూ.10 వేల నుండి రూ.30 వేల వరకు జీతం ఉంటుందని తెలియజేశారు. ఈ ఇంటర్వ్యూలకు హాజరు అయ్యే అభ్యర్థులు ఖచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫోటోలతో అర్హత కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7799587687, 8897776368, 9741432931 ఫోన్ నంబర్స్‌కు సంప్రదించగలరని తెలియజేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు https://skilluniverse.apssdc.inలో రిజిస్టర్ చేసుకోగలరునీ తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సత్య నారాయణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ సాధ్యం : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విద్యార్థి దశ నుంచి క్రీడల్లో రాణించడం వలన మంచి క్రమశిక్షణతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని నూతనంగా ఎన్నికైన బాస్కెట్ బాల్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చింతల శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నూతన అన్నమయ్య జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెంగల్‌రాయ నాయుడు, రాష్ట్ర అబ్జర్వర్ సురేష్ బాబు తెలిపారు. ఈ కమిటీలో జిల్లా అధ్యక్షులుగా చింతల శ్రీధర్ రెడ్డి, సెక్రటరీగా రాయదుర్గం రవి చందర్, జాయింట్ సెక్రటరీగా హేమంత్ కుమార్, ట్రెజరర్‌గా ఆదినారాయణ, తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సెక్రటరీ రవిచందర్ మాట్లాడుతూ జిల్లాలో బాస్కెట్ బాల్ క్రీడకు ఎంతో మంచి ప్రోత్సాహం ఉందని, బాస్కెట్ క్రీడ ద్వారా ఎంతో మంది విద్యార్థులు మంచి స్థాయిలో ఉన్నారన్నారు. అన్నమయ్య జిల్లాలో బాస్కెట్ బాల్ క్రీడను మరింత ముందుకు తీసుకెళ్లి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తా మన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు చెంగల్‌రాయ నాయుడు, అబ్జర్వర్ సురేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక పట్ల సీనియర్ క్రీడాకారులు సుబ్రహ్మణ్యం, సాయిభార్గవ్, అంజి, రెడ్డి, దినేష్‌లు హర్షం వ్యక్తం చేశారు.



నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు చింతల శ్రీధర్‌రెడ్డి, రాయదుర్గం రవిచందర్



అధ్యాపకుడికి కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

'మిట్స్' విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-మదనపల్లి : మిట్స్ కాలేజీలో కంటి పరీక్షలను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. శుక్రవారం మదనపల్లెలోని డాక్టర్ అగ్రవాల్ కంటి వైద్య ఆస్పత్రి సిబ్బంది కళాశాలలోని అధ్యాపకులకు, విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనం ఏ పని చేయాలన్నా మన కళ్లు ఆరోగ్యంగా ఉండాలన్నారు. కంప్యూటర్ల ముందు గంటల కొద్దీ కూర్చుని ఉద్యోగాలు చేసే వారికే కంటి సమస్యలు వస్తుంటాయని చాలా మంది భావిస్తారని తెలిపారు. కాలుష్యం, ఆహారపు అలవాట్లు, ఇతర అనారోగ్యాలు కూడా కంటి ఆరోగ్యంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ఏడాదికి ఒకసారి కచ్చితంగా కంటి ఆరోగ్యం ఎలా ఉందో చెక్ చేయించుకోవాలన్నారు. మనలో చాలా మందికి అసలు ఆ ధ్యాసే ఉండదన్నారు. పెద్ద వ్యాధులు బాగా ముదిరితే తప్ప బయటకు తెలియవన్నారు. పరీక్షల ద్వారా ముందు గానే వీటిని గుర్తిస్తే చెక్ పెట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆరోగ్య వంతమైన కళ్ల కోసం రెగ్యులర్ చెకప్ అవసరమన్నారు. పాలకూర, డ్రై ఫ్రూట్స్, నారింజ, చిలగడదుంప, పొద్దుతిరుగుడు విత్తనాలు, క్యారెట్ రసం వంటి ఆహారాల ద్వారా మన కంటికి సంబంధించిన అనేక రకాల వ్యాధులను నయంచేయడంలో సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అగ్రవాల్ కంటి వైద్య హాస్పిటల్ డాక్టర్ ఎన్.వంశీధర్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ ఇమ్మానుయేల్ రాజ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కమల్ బాషా, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

జోస్ అలుక్కాస్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సర్వజన బోధన ఆసుపత్రి రక్తనిధి కేంద్రం, హెల్పింగ్ మైండ్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జోస్ అలుక్కాస్ 60వ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 32 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్ మాట్లాడుతూ 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు వచ్చి ప్రాణదాతలుగా నిలవాలని ఆకాంక్షించారు. జోస్ అలుక్కాస్ పిఆర్ఒ రంజిత్ కుమార్ మాట్లాడుతూ వ్యాపార రంగంతోపాటు ప్రతి ఏటా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రక్తనిధి కేంద్రం మెడికల్ ఆఫీసర్ భార్గవ్ మాట్లాడుతూశుభకార్యాలు, వేడుకలు సమయంలో రక్తదాన శిబిరం నిర్వహించడం వలన రక్తం కొరత ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జోస్ అలుక్కాస్ మేనేజర్ అలెక్స్, అసిస్టెంట్ మేనేజర్ సంతోష్, అకౌంట్ మేనేజర్ జీను, రక్తనిధి సిబ్బంది సునీత, శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేత్రదానంతో వెలుగులు నింపుదాం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం పశు సంవర్ధక శాఖ ప్రాంతీయ వైద్యశాలలో పిఎంఒఒ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న పసుపు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ వై.విజయ భాస్కరరావు, పిఎంఒఒ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నేత్రదానం మహాదానమని, మరణించిన తర్వాత నేత్రదానం చేయడం వలన పందులకు చూపు నివ్వడమే కాక వారి హృదయాలలో చిరంజీవులుగా నిలిచిపోతారని తెలిపారు. నేత్రదానానికి వయో పరిమితి లేదని తెలియజేశారు. అనంతరం కొందరు కార్యాలయ సిబ్బంది నేత్రదానానికి పేర్లు నమోదు చేసుకున్నారు. నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. నేత్ర దానం చేయడం వల్ల ఎందరికో కంటిచూపును ఇచ్చిన వారవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్, హెచ్ చెర్లోపల్లి పశువైద్యాధికారులు శరత్ కుమార్‌రెడ్డి, జెవిఒ వరదయ్య, ఎల్‌హెచ్‌ఎ బసవరాజు, గురు రాజారావు, హరిబాబు, వాణి, సరిత పాల్గొన్నారు.

దోమల అంతంతోనే వ్యాధుల నివారణ సాధ్యం

ప్రజాశక్తి-పీలేరు: దోమల అంతంతోనే అంటు వ్యాధుల నివారణ సాధ్యమని రేగళ్ళు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ కుమార్ తెలిపారు. శుక్రవారం రేగళ్ళు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర బాధితులు, దోమ లార్వాల కొరకు సర్వే చేసి, లార్వాను గుర్తించి తొలగించారు. ఈ సందర్భంగా చిరు వ్యాధులకు చికిత్స అందించడంతో పాటు కిటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ పట్ల అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రై డేని నిర్వహించడం ద్వారా దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి, వాటిని తొలగించడం జరుగుతుందన్నారు. సమశ్యాత్మక ప్రదేశాలను గుర్తించి గ్రామ పంచాయతీ దృష్టికీ తీసుకు వెళ్లి వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. "దోమ పుట్టరాదు, దోమ కుట్ట రాదు", అనే నినాదంతో వర్షాకాలంలో నీరు నిలువ ఉండి దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. డెంగీ దోమ మంచి నీళ్లలో వృద్ధి చెందుతుందని, ఇంటి పరిసరాల్లో మంచి నీటి తొట్టెలు, డ్రమ్ములు వారానికి ఓ రోజు శుభ్రం చేసి వాటికి మూతలు పెట్టాలని, ఇంటి పరిసరాల్లో కొబ్బరి చిప్పలు, పాత రోళ్ల, టైర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూసువాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ జయలక్ష్మి, సబ్ యూనిట్ ఆఫీసర్ విద్యాసాగర్, హెల్త్ ఎడ్యుకేటర్ ఉషారాణి, పర్యవేక్షకులు చిన్నప్ప, ఎంఎల్‌హెచ్‌పి చంద్రలేఖ, ఆరోగ్య కార్యకర్తలు అయేష, రమాదేవి, లావణ్య, ఆశ కార్యకర్తలు లక్ష్మిదేవి, సుమలత, నందిని, నారాయణమ్మ పాల్గొన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్


వాహనదారులకు సూచనలు ఇస్తున్న సిఐ,ఎస్ఐలు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నిమ్మనపల్లి బస్టాండులో ప్రయాణికులు రాకపోకల కొనసాగించడానికి అంతరాయం కలిగించ వద్దని స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి అన్నారు. శుక్రవారం మదనపల్లె ట్రాఫిక్ సిఐ ఎంవి.రమణతో కలసి బస్టాండ్‌లో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా నిమ్మనపల్లి బస్టాండ్‌లో ఆటోలు కానీ, ద్విచక్ర వాహనాలు కానీ ఇష్టానుసారం రోడ్డుపై నిలప రాదని సూచించారు. ఆర్‌టిసి బస్సులు నిత్యం వస్తుంటాయని ప్రయివేట్ వాహనాలు విచ్చలవిడిగా రోడ్లపై నిలపడం వలన ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికుల రాకపోకల కొనసాగించటానికి సమస్యలు ఏర్పడతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా నిబంధనలను తప్పక పాటించాలని సూచించారు.


ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఐ రెడ్డి శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యను అభ్యసించడం, మానసిక వికాసానికి ఆటలు ఆడాలి తప్ప మరి ఏ ఇతర కార్యక్రమాలలో పాల్గొనకూడదని సూచించారు. తోటి విద్యార్థుల పట్ల స్నేహభావం కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ర్యాగింగ్ చట్టాలు గురించి అవగాహన కలిగి ఉండాలని, తోటి విద్యార్థులతో సైగలు చేసి రమ్మని పిలవడంగానీ, వారిని మానసికంగా హింసించడం కానీ, గాయపరచడం వంటి చర్యలు పాల్పడకూడదని అన్నారు. కళాశాలలో ఏదైనా ఇబ్బంది కలుగుతుంటే కాలేజీలో ఉన్న ర్యాగింగ్ కమిటీ దృష్టికి తీసుకుని వెళ్లి వారి ద్వారా ప్రిన్సిపల్‌కు తెలియపరిచి పరిష్కరించుకోవాలని తెలిపారు. లేకుంటే పోలీసుల దృష్టికి తీసుకుని రావాలని చెప్పారు. బయటకు వెళ్ళేటప్పుడు హెచ్ఒడి వద్ద అనుమతి తీసుకుని బయటికి వెళ్లాలని, అది కూడా రాత్రి 8 లోపల తిరిగి క్యాంపస్ లోకి వచ్చే విధంగా చూడాలని, లేని పక్షంలో రోడ్డుపైన 11 గంటల వరకు తిరుగుతూ ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబును కలిసిన 'ముక్కా'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు


సిఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న రూపానందరెడ్డి

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలు గురించి వివరించినట్లు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ బి రోడ్లు, రైల్వే కోడూరు ఆర్టిసి బస్టాండ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కోడూరు-వెంకటగిరి రోడ్డు, గాలేరి-నగరి కాలవ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు. రైల్వేకోడూరులో ఇంజినీరింగ్ కాలేజీ స్థాపన కోసం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ముఖ్యమంత్రి స్పందించి త్వరలోనే అభివృద్ధి పనులపై తీసుకుంటామని, యువతకు అండగా ఉంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఆలయానికి బియ్యం వితరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కర్ణాటక రాష్ట్రం,చింతామణి ములబాగలో శనిమహాత్మ దేవస్థానం వద్ద భక్తులకు ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుంటారు. శుక్రవారం యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ తరుపున బియ్యాన్ని ఆలయం సభ్యులకు అందించినట్లు ఫౌండేషన్ సభ్యులు తగాది రాజశేఖర్ పేర్కొన్నారు. ఇక్కడ నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి తమవంతు సాయంగా బియ్యాన్ని అందించడం సంతోషకరమని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

తపాలా కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక తపాలా కార్యాలయాన్ని శుక్రవారం కడప జిల్లా సూపరింటెండెంట్ రాజేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని తపాల శాఖ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మీకు కేటాయించిన టార్గెట్‌ను చేరుకోవాలని సూచిం చారు. ఎస్‌బి ఖాతా బీమా, సాధారణ బీమాను గ్రామాలలో ప్రజలకు వివరించాలని చెప్పారు. తపాలా శాఖ చేపడుతున్న ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వి బాధ్యత ప్రతి ఒక్క తపాలా ఉద్యోగిపై ఉన్నదని పేర్కొన్నారు. సుకన్య సమృద్ధి యోజన పథకంలో తపాలశాఖ ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. ఆయనవెంట రాయచోటి ఐపిఒ అమర్నాథ్, ఎఎస్‌పి భాస్కర్‌రెడ్డి, పోస్ట్‌మాస్టర్ పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : భారత రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై అందరికీ అవగాహన ఉండాలని డిటి ఇషాక్ తెలిపారు. శుక్రవారం పంచాలమర్రి పంచాయతీ దళితవాడలో సివిల్ రైట్స్ డే సమావేశం నిర్వహించారు. పౌర హక్కులు ప్రభుత్వాలు అమలుపరిచే పథకాల గురించి వివరించారు. ఈ సమావేశంలో సర్పంచ్ నాగేం ద్ర, ఎంఇఒ త్యాగరాజు, విఆర్ఒ రూపేష్, అఖిలభారత ఏరుకుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులు రఘుపతి, అఖిల భారత బంజారా సేవా సమితి కన్వీనర్ విజయ్ కుమార్ నాయక్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధమ్మ, ఐసిడిఎస్ కౌన్సిలర్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఫ్రీహోల్డ్ భూముల సర్వే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండలంలో చేపట్టిన ఫ్రీహోల్డ్ భూముల రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలని తహశీల్దార్ హరిప్రసాద్ విఆర్ఒలను ఆదేశించారు. ఫ్రీహోల్డ్ భూముల పూర్తి వివరాలు సర్వే నిర్వహించే విధానంపై వివరించారు. ఓటర్ల జాబితా ఇంటింటా సర్వేలో పరిశీలించి తప్పులు ఉన్న సవరించి మృతిచెందిన వారి పేర్లు తొలగించాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతను గుర్తించి వారి పేర్లను ఓటర్ల జాబి తాలో నమోదు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం చేయకూడదన్నారు. సమావేశంలో సర్వేయర్ గిరిఆచారి, అసిస్టెంట్లు, విఆర్ఒలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-చిన్నమండెం: మండల పరిధిలోని మల్లూరు గ్రామపంచాయతీలోని తిమ్మారెడ్డిగారిపల్లెలో ప్రజల తాగునీటి అవసరాల కొరకు అక్కడ ఉన్న చేతి పంపును మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు నూతన బోరును ఏర్పాటు చేశారు. నీరు పుష్కలంగా ఉన్నందున దానికి శుక్రవారం కొత్త మోటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ తెలిపారు. పంచాయతీలోని కొడిదపల్లెలో ఉన్న చేతిపంపును కూడా మరమ్మతులు చేపించి దానికి చేతి పంపును అలాగే అమర్చడం జరిగిందని మల్లూరు గ్రామ సర్పంచ్ నజీర్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో తిమ్మారెడ్డిగారిపల్లె , కొడిదపల్లె ప్రజలు పాల్గొన్నారు.


బోరుకు ఏర్పాటు చేయిస్తున్న సర్పంచ్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


సుండుపల్లి : మొక్కలు నాటుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

పచ్చదనం ప్రకృతి పరవశించి నప్పుడే వర్షాలు కురుస్తాయని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం ముక్కవారి పల్లి పంచాయతీ సంజీవపురం గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. మొక్కను నాటిన వారే సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె:** మొక్కలు నాటి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకుందామని టిడిపి మాజీ మండల అధ్యక్షులు రాజన్న, ఎపిఒ రమేష్ తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశాల మేరకు తవళం గ్రామంలోని శ్రీ నేలమల్లేశ్వర స్వామి దేవాలయం వద్ద తవళం సర్పంచ్ రెడ్డప్ప ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వం 'వన మహోత్సవం' కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాదని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి రామకృష్ణ, సర్పంచ్‌లు పాపులమ్మ మల్లప్ప, రెడ్డప్ప, మాజీ సర్పంచ్ రెడ్డప్ప, ఎం. జయరాం, మాజీ ఎంపిటిసి రెడ్డప్ప, టిడిపి నాయకులు పి.మల్లికార్జునరెడ్డి, బొట్టు రెడ్డప్ప, మణికంఠ, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **సుండుపల్లి:** మొక్కల్ని నాటి, పర్యావరణానికి ఊపిరి పోసి, కాలుష్యాన్ని తరిమికొట్టి, అందరం ఆరోగ్యంగా జీవిద్దామని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి సుగవాసి బాల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సానిపాయ అటవీ రేంజ్ పరిధిలో సుండుపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ప్రాంగణంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. రావి, వేప, నాగమల్లి, తదితర మొక్కలు నాటి మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గట్టు బి.కొత్తకోట మండలంలో ఎంపిడిఒ ఎం.శంకరయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ప్రజలకు గొప్ప అవకాశమన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఎం మంజుల, ఎంఇఒ రెడ్డిశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి, పాఠశాల కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సులోచన, ఉపాధ్యాయులు భాస్కర్,అమరనాథ్ రెడ్డి, గీతాంజలి, విజయ్ కుమారి, సిఆర్‌పి శ్రీనివాసులు పాల్గొన్నారు. **చిట్వేలి :** మొక్కలు నాటడం యువకులు ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని మండల అటవీ శాఖ అధికారి ధీరజ్ అన్నారు. మండలంలోని అనుంపల్లి దగ్గర స్థానిక గ్రామస్తులతో కలిసి సంయుక్తంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమానికి రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి తనయుడు, ముక్కా సాయివికాస్‌రెడ్డి పాల్గొన్నారు. కాలుష్య నివారణ, సకాలంలో వర్షాభావం, మరియు ప్రకృతిలో సంభవిస్తున్న అనేక విపత్తులు ,పచ్చదనం లేక సంభవిస్తున్నాయన్నారు కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు రామాంజుల నాయుడు, రాజు కుంట సర్పంచ్ గుత్తి నరసింహ, టిడిపి యువ నాయకులు కాకర్ల నాగార్జున నాయుడు, జనసేన మండల నాయకులు మాదాసు నరసింహ, దొడ్లవాగు మధు ,కొత్తూరు ఈశ్వరయ్య, కరీం బాషా, గొబ్బిళ్ళ చంగల్ రాయుడు యాదవ్, అటవీశాఖ అధికారులు శ్రీనివాసులు, సావిత్రి ,కె.వి సుబ్బయ్య పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ ప్రమీల పేర్కొన్నారు. శుక్రవారం అటవీశాఖ ఆధ్వర్యంలో మదనపల్లి మండలం లోని నగర వనంలో వనం-మనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపిడిఒ, తహశీల్దార్ ఎఫ్ఆర్ఒ, డిప్యూటి ఎఫ్ఆర్ఒ, ఇజిఎస్ ఎపిడి, ఎపిఒలు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులు, అటవీశాఖ సిబ్బంది, పాల్గొని మొక్కలు నాటారు. **పీలేరు:** చెట్లు ప్రజల క్షేమాన్ని ప్రగతిని కోరుకుంటాయని ప్రతి ఒక్కరూ ఓ మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలనిపీలేరు అటవీశాఖ క్షేత్రాధికారి రామ్లానాయక్ తెలిపారు. చిత్తూరు రోడ్డులోని బాలికల గురుకుల పాఠశాల ఆరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎండి షఫీ, టిడిపి సీనియర్ నాయకులు కోటపల్లి బాబురెడ్డి, రామక్రిష్ణారెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, శ్రీనాథరెడ్డి, సరేష్ రెడ్డి, వసంతాల రాజ, అటవీ శాఖాధికారులు ఎఫ్ఎంఒ సూఫియా సుల్తానా, ఎబిఒ రెడ్డి యయాతి, జగన్, చంద్రకళ, బేస్ క్యాంప్ వాచర్లు పాల్గొన్నారు.


చిట్వేలి : మొక్కలు నాటుతున్న సాయివికాస్‌రెడ్డి, అటవీశాఖ అధికారులు

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

- ముందస్తు అవగాహన లేని అధికారులు
- తొలిసారి సొంత మండలం సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ పీర్‌మున్నీ

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఈ సర్వసభ్య సమావేశం ఎంపిపి చీరల నాగమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల అనంతరం నిర్వహించే తొలి మండల సర్వసభ్య సమావేశానికి హాజరవ్వడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గతంలో తాను సర్పంచ్‌గా ఉన్న ఐదేళ్లలో సర్వసభ్య సమావేశాలకు హజరయ్యాయని అప్పుడు ఎటువంటి అభివృద్ధి జరగలేదని, కూటమి ప్రభుత్వంలో ప్రతి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో వైద్య శాఖ అధికారి మాట్లాడుతూ రానున్నది శీతాకాలం కాబట్టి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. శుక్రవారం పాపిరెడ్డిపల్లి గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. పిఆర్ఎఇ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు రూ.8 కోట్ల తోసిసి రోడ్లు చేయాల్సి ఉందని ఎమ్మెల్యే అధికారులతో చర్చించి నిధులు తీసుకురావాలని పేర్కొన్నారు. అగ్రికల్చరల్ అధికారి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న రైతులకు పంట నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ముక్కావారిపలి ఎంపిటిసి మాట్లాడుతూ యూరియా కొరత మండల వ్యాప్తంగా ఉందని రైతులు ఇబ్బంది పడుతున్నారని వెంటనే యూరియాని కొరత లేకుండా తెప్పించి రైతు భరోసా కేంద్రంలో ఉంచాలని పేర్కొన్నారు. వ్యవసాయానికి సంబంధించి ఎటువంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావాలని వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. మండలంలో 6 వేల నుంచి 7వేల ఎకరాలలో పంటలు సాగులో ఉందని 854 మంది రైతులకు పంట నమోదు ప్రక్రియ చేసినట్లు తెలిపారు. అంగన్వాడీ సూపర్వైజర్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 82 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా కొన్నింటిలో నీటి కొరత ఉందని పరిష్కరించాలని కోరారు. స్థానిక తహశీల్దార్ పీర్‌మున్ని మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 28 రేషన్ షాపులు ఉన్నాయని మంగంపేట, కొర్లకుంట తదితర రెండు గ్రామాల్లోని రేషన్ బండి ద్వారా రేషన్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. చెరువులో మట్టికి సంబంధించి రైతులు కావాల్సి వస్తే తమను సంప్రదిస్తే అనుమతి ఇస్తామని అన్నారు. ఎంఇఒ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో 478 మంది విద్యార్థులు ఉన్నారని ప్రస్తుతానికి మండలంలో సంజీవపురం, ముక్కవారిపల్లి పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం సిబిఎస్ఇ సెంట్రల్ సిలబస్ బోధిస్తున్నట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారి మాట్లాడుతూ పశువులకు షెడ్డు నిర్మించుకోవడానికి 46 దరఖాస్తులు వచ్చాయని, పశువులకు నిర్మించుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. 1నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు మండల వ్యాప్తంగా పశుగణన నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి రైతు కూడా తమ వద్ద ఎన్ని పశువులు ఉన్నాయో తెలిపితే పశు బీమా చేస్తామని చెప్పారు. సర్వసభ్య సమావేశంలో ఒక్క అధికారి కూడా తమ శాఖకు సంబంధించి ప్రజలకు ఏమి కావాలో స్థానిక ఎమ్మెల్యేని, ఎంపిపిని అడగకపోవడం గమనార్హం. సర్వసభ్య సమావేశం నామ మాత్రంగా జరిగింది. పంచాయతీలలో పారిశుధ్యం, సిసి రోడ్లు, పాఠశాలల మరుగుదొడ్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంభాల గురించి, మౌలిక వసతుల కల్పన గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లలేదు. కార్యక్రమంలో తహశీల్దార్ పీర్ మున్ని, ఎంపిడిఒ విజయరావు, ఎస్ఐ మహేష్‌నాయుడు, జడ్‌పిటిసి, వైస్ ఎంపిపి, సచివాలయ సిబ్బంది, వ్యవసాయచ రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మనోజ్ చంద్ర

రాచపల్లిలో మెడికల్ క్యాంప్ నిర్వహణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రంగంపల్లి పంచాయతీ ఆర్.రాచపల్లిలో శుక్రవారం డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎఎన్ఎంల సహాయంతో గడపగడపకు తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించారు. తదుపరి జ్వరం ఉన్నవాళ్లకి రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రజలకు మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా తదితర వ్యాధులు పట్ల అవగాహన కల్పించారు. డాక్టర్ సూచనల మేరకు స్పందించిన గ్రామస్తురాలు సుశీల తమ ఇంటి బయట ఉన్న మూర్తి నీరు నిలువను వెంటనే మట్టితో పూడ్చివేసింది. ప్రజలందరూ స్పందిస్తే మలేరియా, డెంగీ లాంటి విషజ్వరాలు దరి చేరవని సుశీల తెలిపారు. రానున్నది శీతాకాల కాబట్టి ప్రజలకి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సూచించారు.సూచించారు. దోమలు విజృంభించకుండా చర్యలు తీసుకోవాలని, దోమతెరలు వాడాలని చెప్పారు. వేప ఆకు పొగను వేసుకోవాలని, కూలర్లు, టైర్లలో నీరు నిల్వ ఉంచుకుండా చూసుకోవాలని సూచించారు. రెండు రోజులకు మించి జ్వరం వస్తుంటే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకోవాలని సూచించారు. విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ నాగజ్యోతి, ఎఎన్ఎం శివరాములమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల, హరిప్రియ రైళ్లు నిలుపుదల పట్ల హర్షం

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే స్టేషన్‌లో తిరుమల ఎక్స్‌ప్రెస్, హరిప్రియ ఎక్స్‌ప్రెస్ నిలుపుదల పట్ల ఎన్‌డిఎ కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం తిరుమల ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్లను సత్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌డిఎ నాయకులు షబ్బీర్ అహ్మద్, నాగోతు రమేష్ నాయుడు, పోతురాజు మస్తానయ్య, హిమగిరినాథ్ యాదవ్, తాటి సుబ్బరాయుడు, మోడపోతుల రాము, గంధం గంగాధర్, సెమీ ఉల్లా ఖాన్ పాల్గొన్నారు.

అపుస్మా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: అపుస్మా మదనపల్లె నియోజకవర్గం జనరల్ బాడీ సమావేశం జిల్లా అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సెవెన్ హిల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గురువారం జరిగింది. నియోజకవర్గ నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి మదనపల్లె పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సి పాళ్లతో పాటు పీలేరు, పుంగనూరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల నుంచి సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రయివేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించుకోవడానికి అపుస్మా సరైన వేదికని పేర్కొన్నారు. మదనపల్లి నియోజకవర్గం అపుస్మా గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ ఎన్.సేతు (విజయ భారతి హైస్కూల్), చీఫ్ అడ్వైజరుగా కామకోటి ప్రసాద్ రావు (జ్ఞానోదయ హైస్కూల్), అధ్యక్షులుగా రఘునాథరెడ్డి (సెవెన్ హిల్స్ హైస్కూల్), ఉపాధ్యక్షులుగా జనార్దన్‌రెడ్డి (మదర్ మీరా ఆశ్రమపాఠశాల) గోపాల్‌రెడ్డి (గ్లోబల్ స్కూల్), ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసులు నాయుడు (విద్యోదయ హైస్కూల్), కోశాధికారిగా కృష్ణప్ప (వివేకానంద విద్యామందిర్), జాయింట్ సెక్రటరీలుగా మోడెం శ్రీనివాసరావు (సాయి విద్యానికేతన్ హైస్కూల్) మరియు ఆర్.ప్రసాద్ (ఎస్.వి.ఎల్ హైస్కూల్), కో-ట్రెజరర్ గా చక్రపాణి నాయుడు (డైమండ్ హైస్కూల్), ఈసీ మెంబర్లుగా ఆర్.బాబు (న్యూ విద్యార్థి స్కూల్), జి.లావణ్య (గీతావాణి హైస్కూల్), ఎస్.శ్రీనివాసులు (శ్రీనివాస స్కూల్), బి.శ్రీరాములు (జ్ఞానజ్యోతి), ఎస్ మల్లికార్జున (జవహర్ భారతి) మరియు లీగల్ అడ్వైసర్ జి.ఎం.సోహెల్ (అలీ స్కూల్) లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి నియోజకవర్గంలోని అపుస్మా సభ్యులు పాల్గొన్నారు.

అనుమతి లేని స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి: మదనపల్లి పట్టణం ఎన్‌టిఆర్ సర్కిల్ దగ్గర ఉన్న అనుమతి లేని రమ్య స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు అబ్బవరం యుగంధర్, జిల్లా నాయకులు మహేష్, బాలాజీలు శుక్రవారం డిఎంహెచ్ఒ కొండయ్యను కలిసి వినత పత్రం సమర్పించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని రమ్య స్కానింగ్ సెంటర్, రమా నేత్రాలయ కంటి ఆస్పత్రి ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఆసుపత్రిని నడుపుతూ వారి వద్దకు చికిత్సకు వచ్చే పేదలకు వివిధ రకాల పరీక్షల పేర్లతో వేల రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తూ పేదలను ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధం ఉన్నప్పటికీ రమ్య స్కానింగ్ సెంటర్ మాత్రం మాకేమీ నిబంధనలు వర్తించవని ఒక్కొక్క గర్భిణి దగ్గర వారి బలహీ నతలను ఆసరా చేసుకుని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసి వేలకు వేలు సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. కనీసం నిబంధనల ప్రకారం ఉండవలసిన సౌక ర్యాలు కల్పించకుండాసామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని తెలిపారు. ఎటువంటి అనుమతులు అర్హతలు లేని రమ్య స్కానింగ్ సెంటర్, రమా నేత్రాలయ కంటి ఆస్పత్రిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.


మాట్లాడుతున్న జడ్జి భార్గవి

రాజీ కేసులను పరిష్కరించాలి : జడ్జి

ప్రజాశక్తి-నందలూరు

రాజీ పడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి నందలూరు కోర్టు పరిధిలో గల పోలీసు అధికారులతో గురువారం ఆమె క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సెప్టెంబర్14న జరిగే జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలనిఅన్నారు. జాతీయ లోక్ అదాలత్ సంబంధించి ప్రతిరోజూ ప్రీ లోక్ అదాలత్ సిట్టింగులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట రూరల్ సిఐ బివి రమణ, ఎస్‌సిబి సిఐ పవన్‌కుమార్, నందలూరు, పెనగులూరు, పుల్లంపేట ఎస్ఐలు వెంకటేశ్వర్లు, పి.రవిప్రకాష్‌రెడ్డి, మోహన్‌కుమార్‌గౌడ్, కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

నూతన అధికారులను కలిసిన బాస్ నాయకులు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ శ్రీధర్‌రావు, సిఐగా రాజారెడ్డి శుక్రవా రం భారతీయ అంబేద్కర్ సేన (బాస్) నాయకులు వారినీ కలసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన అధికా రులను బాస్ తరపున పరిచయం చేసుకొని,స్వాగతించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులు మండల అభివృద్ధికి కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో డివిఎంసి మెంబరు కే.వి.రమణ, బాస్ జిల్లా నాయకులు యస్.సింగన్న, సచిన్, బాస్ నియోజకవర్గం అధ్యక్షులు రామచంద్ర, బాస్ మండల అధ్యక్షులు పలక వెంకటేష్, బాస్ మండల నాయకులు గోల్లపల్లి వెం కట్, జరప్పల్లి రామాంజీ, బడికాయలపల్లి నరసింహులు, బాస్ నాయకులు శ్రీరాములు, మణి పాల్గొన్నారు.

త్వరలో నీటి సంఘాలకు ఎన్నికలు : డిఇ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రంలో ఉన్న సాగునీటి పారుదల జరిగే ప్రాజెక్టులకు, చెరువులకు త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఇరిగేషన్ డిఇ వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడైతే వ్యవసాయానికి సాగునీరు ఉపయోగపడుతుందో అక్కడ ఎన్నికలు తప్పక జరుగుతాయని మండలంలోని పింఛా ప్రాజెక్ట్, కృష్ణారెడ్డి చెరువు, ఊటి చెరువు, నారాయణరెడ్డి చెరువు, గూనేటి వాగు చెరువులకు చెందిన నీటి సంఘాలకు ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏపే ఆయకట్టు పంటలు సాగు చేస్తున్న రైతులు మాత్రమే పాల్గొనాలని తెలిపారు.

ఎర్రగుంట చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని మినికి పంచాయతీ గ్రామ రైతులు మాలేనెత్తం పంచాయతీలోని మూగెరప్పల్లి గ్రామ రైతులు శుక్రవారం రామసముద్రం తహశీల్దార్ నిర్మలా దేవికి ఎర్రగుంట చెరువు ఆక్రమణ పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రెవెన్యూ గ్రామాల రైతులు సర్వేనెంబర్ 221/8 లో 5.20 సెంట్లు ఉండేదని సదురు కుంట కింద ఆయకట్టు ఇంచుమించు ఐదు ఎకరాల సాగులో ఉందని అన్నారు. తమ గ్రామానికి చెందిన భూస్వామి పి.రెడ్డెప్పరెడ్డి అను వ్యక్తి ధనం బలంతో రికార్డును తప్పుదారి పట్టించి అతని భార్య రత్నమ్మ పేరుపై సదురు ఎర్రగుంట చెరువుకు డూప్లికేట్ పట్టా సృష్టించడం జరిగిందని తెలిపారు. రెవిన్యూ అధికారులు రెండు గ్రామాల రైతులపై కరుణతో ఎర్రగుంటను క్షేత్రస్థాయిలో రెవెన్యూ లెక్కల ప్రకారం సర్వే చేసి ఎర్రగుంట కింద సాగు చేస్తున్న రైతులకు న్యాయం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్‌బాబు

ప్రజాశక్తి-కలికిరి

సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్‌బాబు సూచించారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కిశోర బాలికలకు కాలానుగుణంగా వ్యాప్తి చెందు వ్యాధులను వివరించారు. మలేరి యా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు వంటి రోగాలు దోమకాటు ద్వారా వ్యాపించడం జరుగుతుందని తెలిపారు. తాగునీరు కలుషిత మైతే టైఫాయిడ్, డయేరియా, డిసెంట్రీ, కామెర్లు వస్తాయని అన్నారు. గాలి ద్వారా వ్యాప్తి చెందు వ్యాధులు క్షయ, కరోన, స్వైన్ ఫ్లూ, లెప్రసి వ్యాపించడం జరుగుతుందని తెలిపారు. 17న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ చేతుల శుభ్రత లోని ఆరు దశలను విద్యార్థులతో చేసి చూపించారు. మెడికుర్తి వైద్యులు డాక్టర్ చిన్న రెడ్డెప్ప మాట్లాడుతూ రక్తహీనతకు గురి కాకుండా వసతి గృహంలో ఇచ్చు పౌష్టికాహారం వృథా చేయకుం డా తినాలని సూచించారు. టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు ఎవరికైనా ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకు వస్తే పరీక్షలు నిర్వహించి చికిత్స ఉచితంగా ఇస్తామన్నారు. అనంతరం కిశోర బాలికలతో కలసి సికిల్ సెల్ అనిమియా గోడ పత్రికలు ఆవిష్కరించారు. అనంతరం డిప్యూటీ డిఎంహెచ్ఒ వసతి గృహంలోని వంటగదిని పరిశీలించి వంట వారికి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గులాబ్జాన్, ఎంఎల్ హెచ్‌పి ఆయేషా, ఎఎన్ఎం రమాదేవి, ఆశాకార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీల గడువు పెంపు హర్షణీయం

ప్రజాశక్తి-మదనపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగబదిలీలకు గడువు పెంచినందుకు శుక్రవారం స్థానిక సిటిఒ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగులు తమ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపి జినా మదనపల్లి అధ్యక్షుడు నాగేంద్రబాబు మాట్లాడుతూ ఎపి సిటీ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు నాలుగోరోజు మధ్యాహ్న భోజన సమయంలో మండపేట సర్కిల్ ఉద్యోగులు సమావేశమై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ బదిలీల ప్రక్రియ పూర్తయ్యే లోపు 2.0లో జరిగిన అవకతవకలను సరిదిద్దవలసినదిగాను, ఆబాధితులకు న్యాయం చేకూరెలా చూడవలసిందిగాను, మిగిలిన డిమాండ్లు నెరవేర్చవలసిందిగా రాష్ట్ర అధ్యక్షులు వారిని కోరుతూ వారికి కూడా ప్రత్యేక అభినందనలు తెలిపామన్నారు. కార్యక్రమంలో ఎపిసిటి సర్వీసెస్ డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు టి.పూర్ణం, కెఆర్. గిరిధర్, మదనపల్లి ఎపి జీనా జిల్లా సెక్రెటరీ గురుప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి-గాలివీడు

అక్రమ ఇసుక ట్రాక్టర్‌ను గరుగుపల్లి క్రాస్ వద్ద పట్టుబడినట్లు ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. కొర్లకుంట, పాపాగ్ని నది నుంచి గాలివీడు పట్టణానికి ఇసుక తీసుకొని వస్తున్న ఆదిరెడ్డిపల్లికి చెందిన చిన్న కృష్ణయ్యను అరెస్టు చేసి ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-గాలివీడు

రోడ్డుపై మద్యం సేవిస్తున్న ఇద్దరు యువకులను డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. ఎవరైన బహిరంగా ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని అన్నారు.